# మనసులో మాట ★

"వెరీ గుడ్! యేది - యిప్పుడు వెయ్యి నీ ముక్క!" తన వేళ్ళమధ్య అందంగా విసనకఱ్ఱలా అమర్చుకున్న పేక ముక్కల్ని సగర్వంగా చూస్తూ అంది అరవింద.

"ఆఁ, మరే!" ముడుచుకున్న మొహంతో ముక్క వేయబోయిన రాధ హాల్లో శేఖర్ గొంతు వినిపించటంతో చటుక్కున ఆగిపోయి వదినగారి ముఖంలోకి అనుమానంగా చూసింది.

"మీ అన్నయ్యలావుంది. అప్పుడే వచ్చేశారివాళ. ఆఁ కానీ, కానీ—వెయ్యి! ఆట మంచి పట్టులోవుంది. ఆలస్యం చెయ్యకు—" అంది అరవింద.

"బాబోయ్! అన్నయ్యా! యింకేమయినా వుందా? పేక చూశాడంటే చంపుతాడు" తన చేతిలో ముక్కల్ని గబగబా బల్లమీద వాటిలో కలిపేసింది రాధ.

"ఆగాగు! ఏమిటది? ఆయనొస్తే నిన్నేం చేస్తారూ? చాల్లే, ఓడిపోతానని భయమని చెప్పరాదూ?" రాధ కలిపేసిన ముక్కలవంక కోపంగా చూస్తూ అంది అరవింద.

"పోనీ అలాగే అనుకో!-రేపో, యెల్లుండో అన్నయ్య వూరు వెడ్తున్నాడు అన్నావుగా! అప్పుడు చూసుకుందాం బలాబలాలు. అదుగో అన్నయ్య యిటే వస్తున్నాడులావుంది. ఏవి, నీ చేతిలోవిగూడా యిలాతే!" రాధ అరవింద వైపువంగి

లాక్కోబోతూండగా శేఖర్ లోపలకు వచ్చాడు. "ఏమిటి ? వదినామరదళ్ళ సరాగాలా?" వాళ్ళవైపు పరీక్షగా చూడకుండానే శేఖర్ కోటు విప్పుకుంటూ స్టాండ్ వైపు వెళ్ళిపోయాడు.

"చూడు వదిన !" తెచ్చి పెట్టుకున్న నవ్వుతో—అన్నగారితో అని, ఓసారి అరవింద చేతిలో వున్న పేకవంక భయంగా చూసి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది రాధ. మంచి ఆట మధ్యలో ఆగిపోయినందుకు కోపగించుకున్న అరవింద మాట్లాడకుండా యెటూ చూడకుండా చేతిలో పేకముక్కల్ని బల్లమీద మేడగా పేర్చ సాగింది.

"చాకలి బట్టలు తెచ్చాడా ? రేపు సాయంత్రం గాదు తెల్లవారుఝామునే వెళ్ళిపోవాలి. బట్టలు లేకపోతే శంభుని కబురు పంపి, తెప్పించు.—అబ్బ ! పదిరోజులు యెలాగో?" కుర్చీలో కూర్చుని బూటు విప్పుకుంటూ అన్న శేఖర్ తనవైపు వీపుపెట్టి కూర్చున అరవింద ఏం చేస్తోందో చూడలేదు.

"ఇదివరకు పది రోజులుకాదు, పది నెలలుపొమ్మన్నా బాధనిపించేదిగాదు - యిప్పుడు ఆఫీసులో పది నిమిషాలు ఆలస్యమైతే యెప్పుడు తెంచుకు పారిపోదామా అనిపిస్తోంది. ఏం చేస్తున్నా రండీ అక్కడ ? మాటగూడ మాట్లాడకుండా వూహాలోకంలో విహరిస్తున్నారా ?" విప్పిన బూటుకాలితో పక్కకు నెట్టి పాంట్ జేబులో చేయి పెట్టుకుని అరవిందకి దగ్గరగా వస్తూ అన్నాడు శేఖర్.

"నీకు తెలియదు బాబూ! అన్నయ్య చూస్తే చంపుతాడు–"రాధ కంఠం గింగురుమంటోంది అరవింద చెవుల్లో. ఇందులో చంపేటందుకి ఏముంది–కాలక్షేపానికి ఆడుకునేఆటకి? పెళ్ళిలోగూడా అంతే– పెళ్ళికొడుకు అందరితో బాటు సరదాకి గూడా సిగరెట్ కాల్చలేదు. "యేమిటే అరవిందా! మీ ఆయన పుట్టింది ఈ కాలంలో అయినా, జీవిస్తోంది పురాణ యుగంలోలా వుంది" మైత్రేయి తన భుజంమీద గిల్లుతూ, హేళనగా నవ్వుతూ అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి అరవిందకి.

"యేమిటీ యేం చేస్తున్నావు?" తనకు ఒక అడుగు దూరంలో నిలబడ్డ శేఖరం గొంతు విన్పించినా, అరవింద వెనక్కి తిరగలేదు. తన భుజాలమీద చేతులాన్చి, లేక ఒక భుజంమీద చెయివేసి మరో చేత్తో తన గడ్డం పట్టుకుని తన వైపుకు యెత్తుతాడేమో అని ఆసిస్తున్న అరవింద మనసు శేఖర్ హఠాత్తుగా, దూరంగా వెళ్ళిపోవటంతో చివుక్కుమంది. తల తిప్పి భుజంమీదుగా ఓరగా భర్తవైపు చూసింది. శేఖర్ యెంతదూరమో వెళ్ళలేదు. కిటికీ దగ్గరగా నిలబడ్డాడు. "నిన్నా దరిద్రపు పేక ముట్టుకోవద్దని యెన్నిసార్లు చెప్పాలి?" కిటికీ రెక్కమీద చెయివేసి అరవిందవైపు చూస్తూ అన్నాడు శేఖర్. అంతలో అంత సీరియస్‌గా మారిపోవాల్సిన ప్రమాదం యేం వచ్చిందో అరవిందకు అర్థంగాలేదు. యేవి యిష్టమో, యేవి అయిష్టమో ఒకసారి తెలుసుకుని వుంటే మంచిది– యేదో అనబోయిన అరవింద శేఖర్ మాట్లాడటంతో ఆగిపోయింది. "మొన్నోసారి నువ్వా లతతో

కూర్చుని ఆడుతూంటే వద్దని చెప్పాను. వద్దన్న పనులు చేసిత్తీరాలని నీ కేమయినా నియమాలున్నాయా ?" అదేమిటి - క్షణం క్రితం మాట్లాడిన మనిషేనా ? యేమిటా కంఠం ! చిన్న పిల్లల్ని దండిస్తున్నట్లుగా - అరవిందకు కోపం వచ్చింది. "అందులో తప్పేముంది ? అయినా-" మనసులో వున్నదంతా చెప్పాలని ఉపక్రమిస్తున్న అరవింద "చాల్లే ! వెళ్ళి కాఫీ తీసుకురా - మళ్ళీ నేను వెళ్ళాలి-" కసిరినట్లుగా అని శేఖర్ టై విప్పుకుంటూ డ్రెస్సింగ్ టేబిల్ దగ్గరకు వెళ్ళడంతో చేసేది లేక చేతిలోని పేకని బల్లమీద పడేసి వంటయింటివైపు వెళ్ళిపోయింది.

పెళ్ళయిన ఈ ఆర్నెల్లనుంచీ శేఖర్ని పరిశీలిస్తూనే వుంది. కొన్ని కొన్ని సమయాల్లో అత నెంత విశాలహృదయుడో కొన్ని కొన్నింటిలో అంత సంకుచితత్వంగల మనిషిలా వున్నాడు. మొన్నటికి మొన్న అంతే - తనింట్లో లేదుగదా నిమీ తోచక అలా సుశీలతోపాటు క్లబ్బుకు వెడ్తే ఆ రోజంతా చిరాకుపడ్డాడు. చిరాకుపడట మేమిటి శుభ్రంగా చెప్తే - సుశీలతో తను స్నేహంచేయటం యేమాత్రం యిష్టంలేదట - మరెలా కాలం గడిపేది? యేదో సామెత చెప్పినట్లు - యిదేం ఖర్మం ! శేఖర్ తో తన పెళ్ళి స్థిరపడ్తోందని తెలిసిన రోజున తనెంత సంతోషపడింది! చదువుకున్నవాడే గాక సంస్కారం గలవాడు - హైద్రాబాద్ లో మంచి వుద్యోగంలో వున్నాడు. అదృష్టం యింత ఇదిగా తన్ని వరిస్తోందేమిటి అని తను ఆశ్చర్యపోలేదూ ! పోనీ తన కిష్టం లేకపోవచ్చు - యితన్లు ఆడుకుంటే యేమైందీ ? డబ్బుపెట్టి

ఆడటంలేదుగా, దుర్వ్యసనం అనుకునేందుకు – అయినా అసలు అడిగి చూడాలి. కాఫీకప్పుతో తిరిగివస్తున్న అరవింద గదిలో తను అంతకు ముందు కూర్చున్న టేబిల్ దగ్గర నిలబడి శేఖరం చేస్తున్న పనిని చూచి కొయ్యబారిపోయింది. మరుక్షణంలో మొహం కందగడ్డలా తయారైంది. ఒక్క గంతులో టేబిల్ దగ్గరకు వచ్చి కాఫీకప్పు పెట్టేసి శేఖరం చేతిలో ముక్కలవుతున్న పేకను లాక్కోబోయింది.

"ఇంకోసారి యిది నీ చేతుల్లో కన్పించిందంటే బాగుండదు. నేను కాదన్నపని యీ యింట్లో యింతవరకు జరగలేదు. యిహ జరగదుకూడా! తెలుసా?" తనని అడ్డుకోబోయిన భార్యని తోసేస్తూ చించేసిన ముక్కల్ని దోసిట్లోకి తీసుకుని కిటికీ దగ్గరకు వెళ్ళి బైటకు పారబోస్తూ అన్నాడు. అతని కంఠంలో ఆప్యాయతగాని, ఆదరణగాని యేమాత్రం లేవు.

"అవేంచేశాయి. మిమ్మల్ని? వాటిని చించారుగానీ, నా మనసులో వున్న కోరిక నెలా చించుతారు ?" రోషంగా అంది అరవింద.

"నోర్మూయ్! నువ్వు చదువుకున్న దానివని తెలుసులే! మాటి మాటికీ గుర్తు చేయక్కర్లేదు. యిప్పుడే చెప్తున్నాను. ఇంకోసారి అది నా కంటికి కన్పిస్తే, చాలాదూరం పోతుంది. నా సంగతి నీకు తెలియదు. ఛీ, పాడుగొడవ! యింటికి రాగానే ఓ మాటాలేదు, మంచీలేదు– వుండేదే పది నిమిషాలు" – కోపంతో విసుగ్గా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు శేఖరం. యెందుకింత విసుగు? యిప్పు డెవ

కేమన్నారనీ? పైగా పేక చించేసి-ఇంకా నోరు ముయ్యాలట నోర్మూయ్యటం! ఇరవై రెండేఏళ్ళలో ఎవరిచేతా అన్పించుకోలే దామాట–అరవింద కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. నిజంగా చూస్తే అసలు తనెందుకు ముయ్యాలి? పేకాట తనకిష్టం. ఖాళీగా వున్నప్పుడు అది ముందేసుకు కూర్చోవటం తన హాబీ. తన కిష్టంలేదని, అన్నీ మూసెయ్యాలని ఎక్కడుంది? యెంతస్వార్థం! యిదేగాబోలు, వీళ్ళ చదువు సంస్కారం. యేమిటా విదిలించు కోవటం? తనేమన్నా అతని జీతానికి పనిచేస్తున్న నౌకరా? రోషంతో మరోసారి మొహం యెఱ్ఱబడింది అరవిందకి.

పేకాటంటే తన కెందుకింత అసహ్యమో, చూపు మాత్రంతోనే తన మనస్సంతా యెలా చికాకుతో వ్యథతో గిలగిలలాడుతూందో భార్యకు తర్వాత వివరంగా చెప్పాలను కున్నాడు శేఖర్. వెంట తీసుకువెళ్ళవలసిన కాగితాలు నాలుగూ గబగబా చూసేసి — పడుకునేందుకు గదిలోకి వచ్చేశాడు. ఈరోజు రాత్రి భోజనాలదగ్గరకూడా అరవింద కన్పించలేదు. రాధ ఒక్కత్తే తనతో కూర్చుంది. అరవింద యేది, అని తను అడగలేదు. కారణం తెలుసుగాబట్టి రాధే అంది 'వదిన స్నానం చేస్తోందని. ఆలస్యం అవుతుందికాబట్టి మనం తినేద్దా'మని — సరేనని తనూ కానిచ్చేశాడు. అరవిందకు కోపం వచ్చివుంటుంది. తనకు తెలుసు — రోజూలా తన కళ్ళల్లోకి చూసి యివ్వాళ నవ్వదు. అసలు తను వచ్చినట్లే చూడదు. గమనించనట్లు యే కిటికిదగ్గరో నిలబడి వీపు తనవైపుపెట్టి యెటో చూస్తు న్నట్లు నిలబడ్తుంది. కొంచెంసేపు క్షమార్పణ చెప్పుకోవాలి.

తనని పెళ్ళిచేసుకోవాలని తనెంత తాపత్రయపడ్డాడో వర్ణించి, నవ్వించి కరిగించాలి. మేడమెట్లు యెక్కుతున్న శేఖరం నవ్వుకున్నాడు. కోపం వచ్చినప్పుడు పెదవులు బిగబట్టి యెటో చూస్తున్నట్లున్న అరవింద చాలా బాగుంటుంది – మొదలు యెలా చెప్పాలో – అసలు తన వుద్దేశం యేమిటో అన్నీ మరోసారి గుర్తుకు తెచ్చుకుంటూ గదిలోపల అడుగుపెట్టిన శేఖరం క్షణంసేపు నిలబడిపోయాడు. గదిలో ఎక్కడసామాను అక్కడుంది. కానీ రాధలేదు. శేఖరం చేతికున్న వాచీ చూసుకున్నాడు టైమ్ 10–30 దాటుతోంది. అరవింద యింకా యెందుకు రాలేదు. కోపం చాలా బాగానే వచ్చినట్టుంది. రాధ దగ్గర యిందాక మాటలు విన్పించాయి. అక్కడే కూర్చుని వుంటుంది. ఛ, ఛ! యేంమనిషి? మళ్ళీ తను తెల్లవారుఝామున లేచి వెళ్ళిపోవాలి. కిటికీదగ్గరగా వున్న వాలుకుర్చీలో పడుకుంటూ అనుకున్నాడు. అయినా తను యేమన్నాడనీ – అప్పుడే ఆఫీసునుంచి రావడం–విసుగు, చిరాకులో వున్నాడని కాస్త ఆ మాత్రంగూడా అర్థంచేసుకోలేదా! యీ మాత్రం దానికే? పోనీ రాకపోతే – తనసలు పిలవనే పిలవడు. తెలుసొస్తుంది బాగా – రాకపోతే రాకపోయింది. రాధేమనుకుంటుంది నాలురోజులుండి వెళ్ళే పిల్ల. "అన్నయ్యకి, వదినకి అంతగా పడదే అమ్మా!" అని పిన్నితో చెబ్తుందిగా బోలు – చెప్పనీ! రాధ మాట అలావుంచి నౌకర్లు యేమనుకుంటారు? బట్టలింతకీ సర్దాలో లేదో, ఛ–తనెన్ని చెప్పాలనుకున్నాడు యీరోజు? అంతా పాడుచేసింది. ఒకవేళ రాకపోతే తను అసలే పిలవగూడదు. పిలిస్తే మరీ అలుసు –

నాకోసం పిల్చానని అనుకుంటుంది. కళ్ళమీద చేతులుంచుకుంటూ అనుకున్నాడు శేఖర్. కిటికీ లోంచి వచ్చే సన్నటి పిల్లగాలి అలిసిన అతని శరీరాన్ని మృదువుగా హాయిగా, తాకసాగింది. కళ్ళుమూసుకుని ఆలోచనల్లో పడ్డాడు శేఖరం.

"అబ్బ! ఇంక నిద్రవస్తోంది బాబూ!" పదకొండుగంటలు చూపిస్తున్న గడియారంవంక చూస్తూ, ఆవలిస్తూ అంది రాధ. అరవింద యింకా తనదగ్గర కూర్చుని పుస్తకాలు తిరగవెయ్యటం రాధ వాతావరణాన్ని అర్థం చేసుకోవటానికి తోడ్పడింది. తను నిద్రపోతే గానీ బహుశా వెళ్ళదేమో అనుకున్న రాధ మంచంమీద దిండ్లు సరిచేసుకుంటూ "అన్నయ్య మళ్ళీ యెప్పుడు వస్తాడో - మళ్ళీ నేను వెళ్ళిపోవాలి బాబూ! అమ్మ దగ్గిరనుంచి ఉత్తరం రావాలి. మళ్ళీ కాలేజీ తెరుస్తారు. యేం చదువులో! పాడు?" వత్తిగిలి నిద్ర కుపక్రమిస్తూ అంది. ఊఁ, ఆఁ. అనని అరవింద తదేకంగా పుస్తకంలోకి చూస్తోంది. వారపత్రిక-యేదో కథకి వేసిన బొమ్మ. చాలా బాగుంది. అందంగా వున్న ఆ అమ్మాయి నిలువుటద్దంముందు నిలబడి చేత్తో బొట్టు తీసుకుని పెట్టుకోబోతూ ఆగిపోయినట్లుగా వుండి కుడిభుజం మీద నుంచి చక్కటి చిరునవ్వుతో దూరంగా పడక్కుర్చీలో కూర్చున్న యువకుడివంక చూస్తోంది. బహుశా అతను భర్త అయివుంటాడు. లేకపోతే అమ్మాయి కళ్ళలో ఆ భావాలు, ఆ ఆనందం వుండకపోవచ్చు. కుర్చీలో కూర్చున్న అబ్బాయి మట్టుకు అలా ముఖానికి పేపరడ్డం పెట్టుకుని అలాగే కూర్చుండిపోయాడు. చచ్చినా పేపరు తియ్యటంలేదు. హఠాత్తుగా చూచినప్పుడు, చూసిన రెండు నిమిషాలవరకూ ఆ బొమ్మ

చాలా బాగుంది. కానీ అరగంటనుంచీ అదేబొమ్మని చూస్తున్న అరవిందకి మటుకు విసుగొస్తోంది. పుస్తకంలోకల్లా అందమైన బొమ్మ. కాసేపు అతను పేపరు మడిచేసి ఆ అమ్మాయివంక చూసి నవ్వినట్లుగా వూహించుకుంది అరవింద. మరోసారి అతనెంతకూ పేప రడ్డుతీయకపోతే ఆ అమ్మాయి చిరునవ్వు మానేసి పెదవులు బిగించి కనుబొమలు ముడిచి కోపంగా చూసినట్లు, గిరుక్కున తిరిగి దగ్గరగా వచ్చి ఆ పేపరు లాగేసినట్లు వూహించుకుంది. విసుగొస్తోంది. పత్రికని పక్కన పడేస్తూ అనుకుంది అరవింద. 'రాధ నిజంగా నిద్రపోయినట్లే వుంది. గోడవైపు తిరిగి పడుకుంది. ఇంకా రెండు సంవత్సరాలు పోతే రాధ యిప్పుడున్న దానికి రెట్టింపు లావు అవచ్చు. రాధ కెలాంటి భర్త వస్తాడో - శేఖరం యింకా కాగితాలు చూసుకుంటున్నాడా లేక వచ్చిపడుకున్నాడా? పదకొండున్నరగూడా అవుతోంది. పిలవగూడదూ! పోనీ పిలవకపోతే— యేం ఫర్వాలేదు. అహంకారం, అతిశయం తనకేనా యేమిటి వుంది? పోనీ నిజంగా తనకి పేకాట యిష్టమే లేదనుకో — అది నెమ్మదిగా చెప్పగూడదూ ? చించిపారేసి — పైగా నోర్మూయ్యాలట !' అరవింద బుగ్గలు ఈ సారి మరీ భగ్గుమన్నాయి. అసలు తను వెళ్ళనే వెళ్ళదు. పిలవకుండా వెడ్తే యింకా యెంత హేళనకు గురికావాలి? ఛి, ఛీ! అంతకంటె నీచం మరోటిలేదు. నిజంగా తనంటే యిష్టం వుంటే — పిలుస్తారు. తను వెళ్ళదు—వెళ్ళదు— పట్టుదల తన కెలాంటిదో యెదుటవాళ్ళది గూడా అలాంటిదేనని తను ఋజువు చెయ్యాలి. లైటు తీసేసి రాధ పక్కన పడుకుంటూ అనుకుంది అరవింద.

మూడుగంటలకి అలారం గణగణ మోగటంతో వాలు కుర్చీలో పడుకున్న శేఖరం వులిక్కిపడి లేచాడు. క్షణంసేపు అత నలా యెందుకున్నాడో అర్థంగాలేదు. కిటికీలోంచి యింకా చల్లటిగాలి వస్తూనేవుంది. శేఖరం పక్కకు తిరిగి చూశాడు. పక్క ఖాళీగానే వుంది. అరవిందవచ్చి వెళ్ళిపోయిన చిహ్నాలు గూడా ఆ పక్కమీద ఏం కన్పించలేదు. 'రానే లేదు-యిప్పుడు వెళ్ళిపోవాలి తను. రాధ పక్కన పడుకుని హాయిగా నిద్ర బోతూ వుండచ్చు - యెలాటి మనిషి అనుకోవాలి?' శేఖర్ లేచి చేతికున్న గడియారాన్ని తీసి టేబిల్ మీద పెట్టూ అనుకున్నాడు.

తను వెడ్తానని తెలిసిన శంభు అప్పుడే, అంతకుముందే లేచి అప్పుడే స్నానానికి నీళ్ళు కాచాడు. రాజయ్య సామానంతా జీపులో సర్దుతున్నాడు. అరవింద లేచిన అలికిడిలేదు. రాధగదిలో దీపం లేదు. 'నౌకర్లు నయం' అనుకున్న శేఖర్ శంభుని పిల్చి స్నానానికి నీళ్ళు సిద్ధం చేయమని టూత్ పేస్టు తీసుకుని బాత్ రూమ్ వైపు వెళ్ళిపోయాడు.

రాత్రంతా నిద్రబట్టని అరవింద - శంభు, రాజయ్య యేదో సరిగ్గా మడత పెట్టటంలేదని వేస్తున్న కేకలకి లేచింది. నిద్ర సరిగ్గా పట్టకపోవటంవల్ల కళ్ళు మండుతున్నాయి. 'తనే అనవసరంగా బాధపడ్తోంది-అతను హాయిగా నిద్రపోయి లేచి మామూలుగా నిశ్చింతగా క్యాంప్ కు వెళ్ళిపోతున్నాడు. అవును మరి! మొదట్నుంచీ అలా నౌకర్లతో అలవాటయి పోయింది. తల్లి చిన్నప్పుడే పోయింది. తండ్రిపోయి గూడా నాలుగైదు సంవత్సరా లయింది. అతని జీవితం అలా నౌకర్లకి

బాగా అలవాటయిపోయింది. తనమీద అప్యాయత చూపించలేదని తను అభిమానపడటం గూడా అనవసరం. తనిప్పుడు లేచి చేసేదిగూడా యేం లేదు. అదిగో, శంభు కేక విన్పిస్తోంది—కాఫీ కావాలా పాలు తీసుకురానా అని—తను అదృష్టవంతురాలు అని మురిసిపోవటం యెంతహాస్యాస్పదం! చిరిగిపోయింది పేక ముక్కలు గాదు, నా మనసు' అనుకుంది. అరవింద.

'అబ్బ! యెంత నిశ్చింత—కనీసం యీ గొడవకి—శబ్దానికైనా లేవచ్చుగా—అంత మొద్దునిద్ర పోతోందంటే నిజంగా ఆశ్చర్యంగానేవుంది. పోనీ కనీసం కన్పించటానికేమయింది? అయినా తనేం చెయ్యాలి? నయం, యింకా అందరిలా అయితే బాగానే వుండేది. అసలు తనుయేమన్నాడని? ఆ మాత్రం విసుక్కునే అధికారం గూడా లేదన్నమాట—ఈ కాలం ఆడపిల్లల మనస్తత్వాలే అంతేమో! అందరూ కాదంటున్నా, పిన్ని, బాబాయి బొంబాయిలో మరో మంచిసంబంధం చూస్తామని వుత్తరాలమీద వుత్తరాలు రాస్తున్నా విన్పించుకోకుండా తను కావాలని అరవిందని చేసుకున్నాడు. పిన్ని దృష్టిలో గొప్పతనం అంటే నాలుగురకాల డిగ్రీలుండటం. అందమంటే అనేకరకాలుగా అలంకరించుకోవటం. తెలిసివుండటం—తనకెంత అసహ్యమో! యాదాలాపంగా చూసిన అరవింద తన్ని ఆకర్షించటం, అది పెళ్ళిదాకా వెళ్ళటం, అంతా చిత్రంగా అన్పిస్తుంది. కనీసం ఆ కృతజ్ఞతయినా లేదు అరవిందకి—ఏమిటో' అనుకున్నాడు. 'తను వేటినైతే అసహ్యించుకుంటాడో అవి అరవిందలోగూడా వున్నా యిలావుంది. పోనీ, అలాగే నిద్రపోనీ—యీ పదిరోజులూ యింకా నిద్రబోవచ్చు'

బట్టలేసుకుని ప్రయాణానికి సిద్ధం అయి కాఫీతాగుతూ అనుకున్నాడు శేఖర్.

'నన్ను కాకపోతే కనీసం రాధనైనా పిలవగూడదూ? యెంతఅహంకారం! తనెంత పొరబాటు అర్థం చేసుకుంది! అతనికి తనవసరంలేదు. అది యీ ఆర్నెల్లనుంచీ కొంచెంకొంచెం తెలుసుకున్నా. కాదని తన్ని తను కావాలని మోసంచేసుకుంది. బాగా అయింది. కావాల్సిందే!' చీకటిలో కిటికీ దగ్గర నిలబడి ఆకాశంవైపు చూస్తూ అనుకుంది అరవింద.

'ఛ-ఛ, చాలా తెలివిగలది – చదువుకున్నది అనుకున్నాను. మరీయింత యిది అనుకోలేదు–' టేబుల్ మీదున్న వాచీతీసి చేతికి పెటుకుంటూ అనుకున్నాడు శేఖర్.

"శంభూ! నేను వెడ్తున్నాను. యిల్లుజాగ్రత్త!" జీప్‌లో కూర్చుంటూ అన్నాడు శేఖర్. అలవాటుచొప్పున 'ఇదేంఖర్మ! లక్షణంగా భార్యని పెట్టుకుని' అతని మనసులో యెవరో మూలిగారు.

'అవును, శంభుకున్న విలువగూడా నీకు లేదు యీ యింట్లో. విను, జీప్ వెళ్ళిపోతోంది' అరవింద గుండెల్లో యెవరో బలంగా పోటుపొడిచి మరీచెప్పారు. ఏదో తెలియని బాధతో కిటికీ దగ్గర నిలబడలేని అరవింద యివతలకివచ్చి కుర్చీలో కూలబడింది. అదే సమయంలో అర్థంకాని బాధతో వెనక్కు జారగిల బడ్డాడు శేఖర్. జీప్ డ్రైవ్ చెయ్యటానికి బాగా అలవాటుపడ్డ రాజయ్య చేతులు యాంత్రికంగా నడిపిస్తున్నాయి. తూర్పున యెఱ్ఱగా మొహం చేసుకున్న సూర్యుడు ప్రపంచా

నికి మొహం చూపించనా వద్దా అన్నట్టు అప్పుడప్పుడే పైకి వస్తున్నాడు.

"ఏమండీ వదినగారూ! రాత్రి కోపం యెన్ని గంటల దాకా కావలి కాసింది?" ఎనిమిది గంటలకి నిద్రలేచిన రాధ అరవిందయెప్పుడు లేచిందీ తెలియక ఏ రాత్రివేళో తనపక్క-నుంచి వెళ్ళిపోయిం దనుకుంటూ అడిగింది. ఇద్దరిమధ్యా రాజీ కుదరకపోతే శేఖరం క్యాంప్‌కు యెలా వెడ్తాడు?

ఆరుగంటలకే స్నానం అదీ కావించుకుని యీావిడిలా బుద్ధిమంతురాలిలా పుస్తకం చదువుకుంటూ ఎందుకూర్చుం టుంది?

"ఏమండీ మాట్లాడరా?

"ఏమ్మాట్లాడాలీ?"

"రాత్రి కోపం యెన్ని గంటల వరకూ కావలా కాసిందీ?"

"రాత్రంతా!" చదువుతున్న పుస్తకం పేజీలు తిప్పి ఏదో ముఖ్య విషయం చూస్తున్నట్లుగా అంది అరవింద.

"పోనీ, యెవరు ముందుకువచ్చారు రాజీకి? అహాఁ కోపం వద్దులే! క్షమార్పణ యెవరు చెప్పుకున్నారు?" సమ వయస్కు-రాలయిన రాధకి సెలవల్లో అని వచ్చినా, యీా పది రోజుల్లో బాగా చనువు ఏర్పడిపోయింది. అరవింద గూడా మరో సమయంలో అయితే ఆనందించేది — కానీరాధ తను మర్చిపోవాలని దృఢ నిశ్చయం చేసుకుని కూర్చున్న బాధని కదుపుతోంది.

"ఎవరికీ యెవరూ చెప్పుకోలేదు. అసలు మాట్లాడుకోనే లేదు. సరేనా ?" చూస్తున్న పుస్తకాన్ని కుర్చీలో గిరాటుకొట్టి లేచి పోయింది అరవింద.

"నువ్వేలే—అబ్బో! అన్నయ్యకి ఆమాత్రం సరసం గూడానా ?"

నవ్వుకుంటూ బ్రష్ తీసుకుని బాత్ రూమ్ వైపు వెళ్ళిపోయింది రాధ. గుమ్మందాటి వెళ్ళపోబోతున్న అరవింద ఆగి కోపంగా వెనక్కు తిరిగి చూడటం రాధ చూడ లేదు.

... ... ...

మూడురోజులు గడచి పోయాయి. మనసులో మంటలు మండుతున్నా, రెండురోజు లుండిపోయే రాధ ముందు బైటపడటం యిష్టంలేని అరవింద పైకి నవ్వుతూనే వుండిపోయింది. నాలుగోరోజు సాయంత్రం రాధ తల్లి దగ్గర నుంచివుత్తరం వచ్చింది. అందులో తిను లేవటంలేదని, డాక్టర్లు టైఫాయిడ్ అవుతుందేమో అంటున్నారని రాధని వెంటనే బయలుదేరి రావలసిందిగా కోరుతూ, ఏమీ అనుకో వద్దని అరవిందకు చెప్పమని, వీలయితే సెలవుపెట్టి పదిరోజులు శేఖర్ని, అరవిందని వెంటబెట్టుకుని తీసుకురమ్మని కోరుతూ వ్రాసింది. తల్లి కెప్పుడూ ఆరోగ్యం సరిగ్గా లేకపోతే తండ్రి పడే ఖంగారు తెలుసుకున్న రాధ ఆ రాత్రే ప్రయాణం అయింది.

రాధ వెళ్ళిపోయింది. స్టేషన్నుంచి అరవింద ఒంటరిగా, బరువుగా తిరిగివచ్చింది. ట్రెయిన్ కదలిపోతుండగా

రాధ అరవింద చేతుల్ని తన చేతిలోకి తీసుకుంటూ అన్నయ్య రాగానే తప్పకుండా యిద్దరూ ఓ పదిరోజులు సెలవు పెట్టి రావాలని బొంబాయిలో చూడవలసినవి చాలా వున్నాయని, తప్పకుండా వచ్చితీరాలని ఒట్టువేయించుకుంది. 'ఈ మనిషితో అలాటి సరదాలుకూడానా'— తిరిగివస్తూ అనుకుంది అరవింద. భర్త ఆఫీసరు. నెలకి 20 రోజులు క్యాంప్లోనే వుంటాడు. యిష్టమైతే తనుగూడా అతనితో యెక్కడికిబడ్తే అక్కడకు వెళ్ళవచ్చు అనుకుని మురిసిపోయింది అరవింద. దేశాలు చూడాలంటే తనకెంత యిష్టం! చేతిలో వుండిగూడ అనుభవించలేకపోతోంది. తనకే రెక్కలుంటే ఉదయమే ఏ నాగార్జునసాగర్లాటి డామ్ ప్రాంతాల్లోనో షికారుచేసి, మధ్యాహ్నానికి అరకు లోయల్లోవున్న కరకురాళ్ళ మధ్య విశ్రాంతి తీసుకుని, సాయంత్రానికి అజంతా, యెల్లోరా చూసుకుని, రాత్రికి వెన్నెల్లో నవ్వుతున్న తాజ్ మహల్ సౌందర్యాన్ని అనుభవించి, పడుకోవటానికి హిమాలయాలకి ఎగిరిపోదూ! అవునవును—వూహలోకానికి, యధార్థానికి చాలా తేడా. శేఖర్ యీ క్యాంప్లో బెంగుళూర్ గూడా వెళ్తాడులా వుంది. అసలు మొదలు యెక్కడకో వెళ్ళేది, తనకు తెలియనే తెలియదు యెవరన్నా వింటే నమ్మనే నమ్మరు. అతిశయోక్తి అనుకుంటారుగూడా- యిప్పు డింటికెళ్ళి ఏం చెయ్యాలి? ఏమీ లేదు. శంభు పెట్టిన అన్నం తిని కళ్ళు మూసుకు పడుకోవటం. అబ్బ — యెంత నిస్సారంగా అనిపిస్తోంది జీవితం! తను కోరుకున్న జీవితం ఏమిటి? యిప్పుడనుభవిస్తోంది ఏమిటి? ఇంత పెద్ద ఆఫీసరు భార్య

నవుతానని కల్లోగూడా అనుకోలేదు. అవునవును, ఆఫీసరు భార్యగా అన్ని కోర్కెలూ చంపుకుని పంజరంలో పక్షిగా వుండాలని కూడా అనుకోలేదు. శేఖరం బహుశా ఇలాంటి వాడని తనేమాత్రం వూహించినా తనీ పెళ్ళికి చచ్చినా ఒప్పుకునేదిగాదు. హోదా, డబ్బు, గౌరవం యివి తప్ప అతనికి తెలిసింది యింకోటి లేదేమో! శేఖరం ఏంచేస్తుంటా డిప్పుడు? ఫారెస్ట్ రెస్ట్ హౌస్‌లో కూర్చుని కాగితాలు చూసుకుంటూనో, లేక ఏ టీక్ ప్లాంటేషన్ అయినా చెక్ చేస్తునో—'అది కాదు యిలా, యిక్కడ వుండవలసింది ఈ విధంగా గాదు, అమూల మీరలా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా వుండగూడ'దని అధికారయుతంగా సలహాలిస్తూనో వుంటాడు. ఫీల్డ్‌లో పొడుగాటి అతని విగ్రహం గబగబా అంగలు వేసు కుంటూ చకచకానడుస్తుంటే పక్కవాళ్ళు నడువలేక పరుగెత్త లేక పడే అవస్థ రాజయ్య వర్ణించి చెపుతుంటే వినాలి ఇహ! ఆ మనిషి అంతే—కాగితాలు, ఇనస్పెక్షన్‌లు, టూర్లు, ఆఫీసు. వాటికి మించి మరోపనికి అతని జీవితంలో భాగంలేదు. ఇక్క డికే అవి చాలీచాలని అద్దెకొంపలో వున్నట్లు యిరుక్కు యిర క్కునివున్నట్లు వుంటాయి. యెప్పుడూ పుస్తకం చదువుతూనో లేక కాగితాలు చూసుకుంటూనో తప్ప శేఖర్ తనకి వట్టిగా యెప్పుడూ కన్పించలేదు. పెళ్ళయిన ఆర్నెల్లకి ఆఫీసర్ని పెళ్ళాడ టంలోగల బుద్ధి తక్కువతనం గుర్తించిన అరవింద లెంపలు వేసుకుంది. దీనికోసమేనా ఆడవాళ్ళందరూ కావాలని గోల పెట్టేది! తనిక్కడ యిలా క్షణం తోచకుండా సతమత మౌతోంది. అక్కడ శేఖరం—అతనికేం, నిర్విచారం. కనీసం

చెప్పకుండా వచ్చేశాననన్న బాధకూడా వుండివుండదు. యెంత నిర్లక్ష్యం! అరవిందకి ఒళ్ళంతా ముళ్ళుగుచ్చుకున్నట్లని పించింది. ఇంకా వారం రోజులు యెలా భరించడం యిలా? పోనీ తను యీ వారం రోజులూ బెజవాడ వెళ్తే? అమ్మో! యింకేమయినా ఉందా? ఒకసారి వద్దన్న పేకని ముట్టుకుంటే మండిపడ్డ మనిషి! అయితే - తన కేమిటి భయం? కనీసం వూరువెడ్తున్నాననిగూడా చెప్పలేని పెద్దమనిషి — అసలేం చేస్తాడో చూస్తేసరి! ఒకవేళ ఏదయినా అసభ్యంగా ప్రవర్తిస్తే తను తండ్రితో అంతా చెప్పేసి నేనీ కాపురం చేయలేనని ఖచ్చితంగా చెప్పేస్తేసరి - అవునుమరి! యిలాక్షణం తోచ కుండా బాధపడేకంటే అదే మంచిది. ముందు తను క్యాంప్ వెళ్ళిపోయారని నేనిటువచ్చానని చెప్తే పోతుంది. ఆ తర్వాత చూడవచ్చు.

ఇంత పెద్ద యింట్లో ఒక్కత్తె! ఉదయం ఆరుగంటల బస్సుకి వెళ్ళిపోవటానికి నిశ్చయం చేసుకున్న అరవింద లేచి బట్టలు సర్దుకోవటానికి తనగదిలోకి వెళ్ళిపోయింది.

శేఖర్ తన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడని బాధపడి అర వింద తండ్రి దగ్గరకు వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్న సమ యానికే, శేఖర్ ఒంట్లో ఏం బాగలేదని క్యాంప్‌ని కేన్సిల్ చేసుకుని వెనక్కు బైలుదేరాడు. రాజయ్య అన్నీ పాక్‌చేసి తిరుగు ప్రయాణానికి సిద్ధం చేస్తున్నాడు. రెస్ట్‌హౌస్ కిటికీ దగ్గర నిలబడ్డ శేఖరం దూరంగా కనిస్తున్న కొండల కేసి చూస్తున్నాడు. క్యాంప్‌కి వచ్చాడన్న మాటేగాని, మనసు మనసులోలేదు. 'అరవింద ఏంచేస్తూ వుంటుంది, యీ పాటికి?

రాధతో కాలక్షేపానికి ఏదో కబుర్లు చెప్తూనో, లేక బజారు నుంచి మళ్ళా పేక తెప్పించి ఆడుకుంటూనో వుంటుంది. తను వెళ్ళేసరికి హాల్లో నిశ్చింతగా పేక ఆడుకుంటూ, నవ్వుకుంటూ వాళ్ళిద్దరూ సంతోషంగా వుండివుండచ్చు. తనకు తెలుసు, తను వెళ్ళగానే అరవింద మొహం యెఱ్ఱబడి పోతుంది. రాధ ఆట ఆపేసి ఏదో పని వున్నట్లు అక్కడ్నుంచి వెళ్ళిపోతుంది. చేసినపని తప్పన్న సంగతి తెలుసుకున్న అరవింద తలెత్తకుండా అలాగే కూర్చుండిపోతుంది. తను కోప్పడ్డాడని—విసుక్కుంటాడని వూహించుకుంటున్న అరవిందకి ఆశ్చర్యం కలిగేటట్టు తను దగ్గరగా వెళ్ళి భుజాలమీద చేతులు వేసి ఆప్యాయంగా తన వైపుకు తిప్పుకుని యెన్నో విషయాలు వివరంగా, మృదువుగా చెప్తాడు. ముఖ్యంగా పేకాటని గురించి దానిమూలంగా తన తండ్రి, తల్లి యెంత బాధపడ్డారో అరవిందకు తను చెప్పాలి. నిత్యం పేకాటలో మునిగిపోయి సిగిరెట్టు కాల్చుకుంటూ, తాగుతూ స్నేహితుల దగ్గరే కాలం వెళ్ళబుచ్చేనాన్న తల్లిని యెంత క్షోభపెట్టాడో అరవింద కెలా తెలుస్తుంది? చివరికి ఆ క్షోభని, ఆ బాధని భరించలేక అన్నం, నీళ్ళు మానేసి దిగులుతుతో కృశించిపోయి తన్ని తను క్రమంగా చంపివేసుకున్న తల్లి సంగతి గుర్తుకు వచ్చేసరికి శేఖర్ కళ్ళు నీళ్ళతో నిండాయి. నాన్న గూడా మొదట్లో సరదాగా ఆడేవాడు. అప్పుడప్పుడు రాత్రిపూట అమ్మగూడా ఆడేది. కానీ కాలక్షేపానికి అలవాటుచేసుకున్న ఆట వ్యసనం క్రింద మారి చివరికి అమ్మని బలిగొంది. అరవింద అంత దూరం వెడ్తుందనిగాదు తన వుద్దేశ్యం, ఆ పాడు పేకని

చూస్తే అదంతా తనకు జ్ఞాపకం వస్తుంది. మనస్సంతా ఏదో దిగులుగా, వ్యథగా అనిపిస్తుంది. ఇదంతా తను అరవిందకు ఆరోజు రాత్రే చెప్పాలనుకున్నాడు. కానీ అరవింద రాలేదు. పోనీ తనే ముందు పిల్చినా బాగుండేది. అలవాటు లేని పని చేయటానికి ఆత్మాభిమానం అడ్డంవచ్చింది. పేక ముట్టుకోవద్దంటే అరవింద ఏ మనుకుందో!— భార్యాభర్తల మధ్య మనస్పర్థలు యెలాటి వాతావరణాన్ని సృష్టిస్తాయో తనకు తెలుసు. చిన్ననాడయినా అమ్మ, నాన్న మధ్య అనవసరంగా తప్పుకున్న అఘాతాలని అర్థం చేసుకోగలిగాడు. అరవిందను తను కావాలని యేరి కోరి చేసుకున్నాడు. కావాలంటే అరవిందకోసం ఆత్మాభిమానంగాదు యేదయినా వదులుకుంటాడు. తనది తప్పే — ఆరోజు రాత్రి పిలిస్తే బాగుండేది. తనకిప్పుడింత బాధగూడా వుండేదిగాదు. ఇంత వరకూ క్యాంప్‌కు వస్తే యినస్పెక్షన్‌లో యెంత గట్టిగా వుండేవాడు! ఈసా రెందుకో యిందాక మొక్కల్ని చెక్ చేస్తూంటే యెందుకో తల పైకెత్తి ఆకాశంలోకి చూశాడు. అక్కడ తారట్లాడుతున్న తెల్లమబ్బులు అరవిందని జ్ఞాపకం తెచ్చాయి. దూరంగా కొండలు, చుట్టూ అడివి. కుడివైపు కొండమీదుగావున్న డాక్ బంగళా—ఆ బంగళా పిట్టగోడదగ్గరగా అరవిందని నిలబెట్టి జుట్టంతా విరబోసి భుజాలమీదుగా, వదిలి యెటో చూస్తున్న భంగిమలో ఫోటోతీస్తే యెంత బాగుంటుంది! విరబోసుకున్న ప్రకృతికన్యతో ఆడుకోవటానికి వచ్చిన అందాల రాకుమారిలా వుంటుందికాబోలు.

"సార్! యిటు, యింక అటేమీ లేదుగా" చిక్కపడి వున్న ముళ్ళ మొక్కలవైపు పరధ్యానంగా వెళ్ళబోతున్న తనని పక్కనున్న రేంజి ఆఫీసర్ యీ లోకంలోకి తెచ్చాడు. వులిక్కిపడి తన చుట్టూ చూశాడు. ఫీల్డ్‌లో సగభాగం దాటి యివతలకు వచ్చేశారు. తనవన్నీ చూస్తున్నాడనుకుంటున్నారు వాళ్ళు — శేఖరం మొహం అనుకోకుండా యెఱ్ఱబడింది. చాలని చెప్పి బంగళాకి తిరిగి వచ్చేశాడు. రాజయ్య అన్నీ సిద్ధంచేశాడు. 'మరోసారి అరవిందని తీసుకుని తప్పకుండా యిక్కడకు రావాలి. కొండలు, గుట్టలంటే తనకి చాలా యిష్టమని యెన్నోసార్లంది' దూరంగా కొండలమీద నుంచి అస్తమిస్తున్న సూర్యుడ్ని చూస్తూ అనుకున్నాడు శేఖర్. జీప్ యింటిముఖం పట్టింది. సౌందర్యాన్ని నింపుకున్న అడవి వీడ్కోలు యిచ్చింది. బారులుతీర్చి నిలబడ్డ పెద్ద వృక్షాలు చిరునవ్వుతో పక్కకు తప్పుకుంటున్నాయి. పూసిన యెఱ్ఱ తంగేడు చెట్టుమీద కూర్చున్న పిట్ట ఏదో అర్థంకాని భాషలో తనలో తను మాట్లాడుకుంటోంది. హమ్మయ్య— తృప్తిగా వెనక్కు జారగిలబడ్డాడు శేఖర్.

... ... ...

"నీకు తెలియదు సుమిత్రా! ఒకటి గాదు, రెండుగాదు, ఆర్నెల్లు స్టడీ చేశాను. ఇంకా అందులో అర్థంగాని విషయమంటూ లేదు. అసలు తన స్వభావమే అంత. డబ్బు, హోదా తప్ప మరొకటి తెలియదు. నేను నాన్నకు చెప్పేస్తాను, ఇహ అక్కడకు వెళ్ళదల్చుకోలేదని. జీవితంలో పొరపాటున ఒక పొరపాటు చేసినంత మాత్రాన దిద్దుకోవటానికి వీలు లేదా

ఏమిటి?— నేను నిజంగా నిశ్చయించేసుకున్నాను. ఇహ వెళ్ళను. చెప్పకుండా వచ్చేశాను కాబట్టి అతనిక్కడికి రాడు." స్నేహితురాలి చేతుల్లో మొహం దాచుకుని బాధ బాధగా, ఆవేశంగా అంది అరవింద.

"మరి మీ నాన్న యేమన్నారు?" గంటనుంచీ మాట్లాడుతున్న స్నేహితురాలివంక అర్థంగానట్లు చూస్తూ అంది సుమిత్ర. హాయిగా, లక్షణంగా అన్నీ వున్న భర్త దొరకగా సుఖపడలేని అరవింద తనదగ్గర వుద్యోగంచేసి సుఖపడగలదా? ఏ కారణాలవల్ల తనీ నిశ్చయానికి వచ్చానని చెప్పిందో అరవింద, ఆ కారణాలు అంతగా లెఖ్ఖపెట్టవలసినవిగా కన్పించ లేదు సుమిత్రకి.

"నాన్న ఏమంటారు? తెలుసుగా! నామాట కాదనరని. అతన్ని క్యాంప్‌నుంచి రానీ వుత్తరం రాస్తానన్నారు. డబ్బుతోను, హోదాతోను తనలాగా అందరూ తృప్తిపడరని అతనికి తెలిసిరావాలి." మొహం పైకెత్తుతూ అంది అరవింద.

"సరే— కానీ మరి పోస్ట్ అయితే ఖాళీ వుందనుకో, అయినా యీ వెల్‌ఫేర్ బోర్డు నీలాటి సుకుమారికి పనికి రాదని నా వుద్దేశ్యం – నీ కివ్వబోయే పోస్ట్‌కి నీకు జీపు అదీ యిస్తారు. నువ్వు వూళ్ళన్నీ తిరగాలి. మరి తిరగ్గలవా?"

"యెందుకు తిరగలేను? నేను మటుకు నీలా కానా?" స్నేహితురాలి కళ్ళలోకి చూస్తూ అంది అరవింద.

"యెలా అవుతావు? నేనే నువ్వయితే హాయిగా శేఖరం చెప్పినట్లు విని యింట్లోనే వుండేదాన్ని?" నవ్వుతూ అంది సుమిత్ర. అరవింద మొహం తిప్పేసుకుంది. 'సుమిత్రకి

తను అర్థంగా లేదు. శేఖరం ఒక్క పేకాడవద్దన్నాడనే కోపంతో తను వచ్చేసింది అనుకుంటోంది సుమిత్ర. అంతే, తనెవ్వరికీ అర్థంగాదు. అది తన దురదృష్టం, టీ తీసుకు రావటానికి వెళ్ళి పోయిన సుమిత్ర వేపు చూస్తూ అనుకుంది అరవింద.

మొత్తానికి ఖాళీగావున్న ఆ వుద్యోగం తనకిప్పించేటట్లు చేస్తానని సుమిత్రచేత వాగ్దానం చేయించుకుని గానీ అరవింద యివతలకు రాలేదు. ఇంటికొచ్చేసిం తర్వాత జరిగిందంతా రాధకు వుత్తరం రాస్తూ కూర్చుండిపోయింది. వుత్తరం ముగింపులో యీ సంబంధం-వదులుకున్నా - స్నేహితులుగా తమిద్దరూ యెప్పటికీ వుత్తరాలు రాసుకుంటూ వుండటం తన కిష్టమని వ్రాస్తోంది అరవింద. చిరునవ్వుతో, చిలిపిగా వుండే రాధంటే అరవిందకి యిష్టం యేర్పడింది. వుత్తరం అంటి స్తుండగా "అరవిందా! యెక్కడున్నావే?" వంట యింట్లోంచి బామ్మకంఠం ఖంగారుగా విన్పించటంతో చేతిలో కవర్ని టేబిల్ మీద పడేసి అరవింద ఆదుర్దాగా యివతలకు వచ్చింది. యేమయింది? అసలే అనారోగ్యం మనిషి. - వద్దంటే విన్పించు కోకుండా అడ్డమైన చాకిరీ చేస్తుంటుంది.

"చూడు, చూడు! అతనొచ్చాడు. యిదేమిటి? క్యాంప్‌లో వున్నాడన్నావుగా - ఒరే వెంకా! ముందు ఆ గిన్నెలు తోమి యిలా బోర్లించు- చూడు సుబ్బులూ! వేడి నీళ్ళ కాగు క్రింద నిప్పు వెయ్యి. చూడమ్మా అరవిందా! నువ్వు కొంచెం కాఫీచేసి అతని కివ్వు" అనుకోకుండా వచ్చిన శేఖరాన్ని చూసి ఆవిడ ఖంగారు పడ్తోంది. వచ్చి నప్పటి నుంచీ అరవింద మాటలు వింటూనే వుంది. మంచివాడేగాని,

కొంచెం కోపిష్టిగూడానయ్యో. అయినా మగవాళ్ళకి ఆ మాత్రం కోపం లేకపోతే .అందం యేముంటుంది? ఆయన బ్రతికుండగా.
“అదేమిటే కొయ్యబొమ్మలా అలా చూస్తూ నిలబడ్డావు - నా మొహాన కోతులాడటం లేదుగా, మీ నాన్న యింకో అర గంటకి కాని రాడు, చూడు, మంచినీళ్ళు కావాలో ఏమిటో!”

గుమ్మాన్ని చేత్తో పట్టుకుని అలాగే నిలబడిపోయిన మనవరాలి వంక చూస్తూ మందలించింది బామ్మగారు.

శేఖరం వచ్చాడు! ‘వచ్చాడా ? అరవింద గుండె ఒక్కక్షణం ఆగిపోయి, రెట్టింపు వేగంతో కొట్టుకోవటం మొదలు పెట్టింది. యెందుకొచ్చినట్లు? క్యాంప్ యింకా వుందిగా ! తా నిక్కడకు వచ్చేసినట్లు శంభు వుత్తరం రాశాడా? లేకపోతే అన్నీ తన కిష్టంలేని పనులు చేస్తున్నానని నాన్నతో ఫిర్యాదు చేయడానికా ? కానీ, ఏం జరుగుతుందో చూదాం! తనేనా జవాబు చెప్పలేంది?’ అరవింద లోపలికివచ్చి కాఫీ కలపటంలో నిమగ్నురాలయింది. మడిగట్టుకున్న బామ్మగారే మంచినీళ్ళు తీసుకుని కుశలప్రశ్నలు వెయ్యటానికి వెళ్ళింది.

ఏదో అవుతుంది! ఏదో జరుగుతుంది! దానికి తను ధైర్యంగా నిలబడాలి అని తన్ని తను సిద్ధపరుచుకుని ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఆ క్షణంకోసం చూస్తున్న అరవిందకి రాత్రి 10 గంటలు దాటినా ఏం జరగలేదు. ‘నాన్న అంతకంటే— తను చెప్పినవన్నీ మర్చిపోయినట్లున్నాడు - పండక్కి వచ్చిన అల్లుడిలా మాట్లాడుతున్నారు. కావాలని క్యాంప్ కేన్సిల్ చేసుకున్నానని, బొంబాయి పిన్నిని చూడటానికి అరవిందని కూడా తనతో తీసుకువెళ్ళాలిగాబట్టి యిటు వచ్చానని చెబ్తు

న్నాడు. అంతా 'నటన' అనుకుంది తలుపు పక్కన నిలబడి పక్కలు కత్తిరిస్తున్న అరవింద.

వద్దంటున్నా వినకుండా లేనిపోని హడావిడిచేసి గదంతా అరగంటలో అలంకరించింది బామ్మ. తను విసుక్కుంటున్నా వినకుండా పెద్ద సన్నజాజిపూల దండ తెచ్చి తల్లో తురిమింది. అరవింద కెందుకో ఏడుపొస్తున్నంత పనైంది. పోట్లాడటానికి సిద్ధంగా వెడ్తున్నవాళ్ళు యిలా అలకరించుకోవటం యేం బాగుంటుంది? అయినా తప్పదు. బామ్మది మొండిపట్టు – తనతో చెప్పకుండా వచ్చేసినందుకు శేఖర్‌కి సంజాయిషీ చెప్పుకోవాలి. తను అది సిద్ధంచేసుకునే వుంచుకుంది. యిక భయం దేనికి ? తన మాటలకి అతని మొహం యెఱ్ఱబడ్తుంది. తనను నొప్పించే మాటలు చదువుకున్నావని, నోర్మూయ్యమని యెన్నయినా అనవచ్చు. వాటికిగూడా తను జవాబు చెప్పగలదు. అహంకారం యెవరికో తనివాళ నిరూపించబోతోంది. ఆ క్షణం యెంత త్వరగా వస్తే అంత బాగుండు.

అరవింద యెదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. అంతా నిద్రపోయారు. రోజూ రాత్రి పదకొండు గంటలదాకా గీత చదువుకునే బామ్మ యీరోజు అలసిపోయి కాబోలు త్వరగానే పడుకుంది. నాన్నగూడా నిద్రపోయినట్టేవుంది, కదలిక లేదు. మంచినీళ్ళు తీసుకొని అరవింద మెల్లిగా గదిలోకి అడుగు పెట్టింది. గదిలో శేఖరం కిటికీ రెక్కమీద చేయి ఆన్చి బైటికి వెన్నెల్లోకి చూస్తున్నాడు. తన అడుగుల చప్పుడు

అతన్ని యీ లోకంలోకి తీసుకురానందుకు అరవిందకు కోపం వచ్చింది. తనకేం భయంలేదు. తనే ముందు మాట్లాడుతుంది.

"క్యాంప్ యెందుకు కేన్సిల్ చేసుకున్నారు?"

వులిక్కిపడ్డ శేఖరం వెనక్కి తిరిగి క్షణంసేపు అరవింద వైపు పరిశీలనగా చూశాడు. అదేమిటి? అతనికళ్ళు నవ్వుతూ వున్నాయి! కోపంతో లేవేం ఆ కనుబొమలు? సంతోషంతో వున్నప్పుడులా వున్నాయిగానీ – ముడుచుకుని దగ్గరగా లేవేం? యిదేమిటి? తనతో అతను పోట్లాటకి రాలేదా? అవు నవును – అతను యెందుకు నవ్వుతోందీ తనకు తెలుసు–తను తయారైన విధానాన్నిగురించి కావచ్చు. లేక నువ్వే ముందు మాట్లాడావు అనే గొప్పతనం చూపించుకున్నట్లు కావచ్చు.

"అరవిందా!" దగ్గరగా వచ్చిన శేఖరం అరవిందని విడిపించుకోటానికి వీలులేదన్నంత దగ్గరగా లాక్కున్నాడు. యేదో చెప్పబోయిన అరవిందని అతను మాట్లాడనియ్యలేదు. చెప్తున్నాడు. "క్యాంప్‌నుంచి యింటికి రాగానే నువ్వు లేవని శంభు చెప్పేసరికి యెంత నీళ్ళు కారిపోయానో తెలుసా? అసలు నే నలా వూహించుకోనేలేదు. రాధ గూడా వెళ్ళిపోయిందని తెలిసింది. క్షణం తోచలేదు. యెప్పుడూ లేంది – ఆ యిల్లు నాకు మొదటిసారిగా నిర్జీవంగా తోచింది. యెందుకు వచ్చే శావు? నామీద కోపం! అవునా? మరి ఆరోజు రాత్రి నీకోసం నే నెంతసేపు యెదురుచూశానో నీకు తెలియదు. కోపం వస్తే దగ్గరగా వచ్చి దండించాలి. చేసిన తప్పుకి శిక్ష విధించాలి. కానీ యిలా దూరంగా పారిపోయి వస్తారా? అబ్బ! ఇంక అసలు నువ్వు జీవితంలో మళ్ళీ కళ్ళకి కన్పిస్తావా అన్పించింది."

తన భుజంమీద తల ఆన్చుకున్న అరవిందని మరింత దగ్గరగా తీసుకొంటూ అన్నాడు శేఖర్. ఆశించని యీ ప్రసంగంతో అరవింద అయోమయంలో పడిపోయింది. తను వూహించుకుందేమిటి? జరుగుతున్నదేమిటి? దీనికి తను సిద్ధంగా లేదు. యిది గాదు తను ఇన్నిరోజులనుంచీ వూహించుకుంది. ఇప్పుడేం చెయ్యాలి? యేమిటి? ఆ కంఠంలోని ఆర్ద్రత ఛీ-ఛీ- తను మారిపోతోంది. తను కరిగిపోగూడదు.

"పేకాట వద్దని ఆరోజున చాలా కటువుగా చెప్పానుగదూ! దానికి మంచిశిక్షే వేశావుగా! పేకాట యెందుకిష్టం లేదో చెప్పనా?" శేఖర్ తండ్రిమూలంగా తన తల్లి పడిన బాధలన్నీ చెప్పసాగాడు. చివరికి వ్యసనాల పుట్ట అయిన తన భర్తని భరించలేక తల్లి కృశించటం వర్ణిస్తూంటే అరవింద కళ్ళల్లోనీళ్ళు తిరిగాయి.

‘ఇదా శేఖరంలోవున్న అసలు బాధ! మరి తనకెందుకు చెప్పలేదు?’ శేఖరం ఇంకా చాలా చెప్తున్నాడు. కాని అరవిందకి అవేమీ విన్పించడం లేదు. ఏదో బాధ రాబోయి ఆగిపోయింది. ఏదో మహాప్రమాదం క్షణంలో జరగబోయి తప్పిపోయింది. తనకిప్పుడు శేఖరం అర్థం అయాడు. యెంత ప్రశాంతంగా వుంది! తన చెవి దగ్గరగా అతని చేతికున్న గడియారం టిక్ టిక్ మనే చప్పుడు ఎంత మధురంగా వుంది! నిట్టూర్పు విడుస్తూ అనుకుంది అరవింద.

"అమ్మ బాధను అర్థంచేసుకున్నా-గంభీరుడైన నాన్నని వేలుపెట్టి చూపగల ధైర్యం లేకపోయింది. అర్థం చేసుకున్న బాధని అనునయిస్తూ అమ్మని యెలా వోదార్చాలోగూడా

తెలియదు. అదో పీడకలగా అనిపిస్తుంది అరవిందా ! అమ్మ పోయింది. నాకీ ప్రపంచమే శూన్యం అయిపోయినట్టు తోచింది. నాన్నకు భయపడ్డ బంధువులు మా చాయలకి గూడా వచ్చేవారు గాదు. మొదట్నుంచీ అన్నీ వున్నా, అలా ఏకాకిగా జీవితానికి అలవాటు పడిపోయాను. ఆ తరువాత నాలుగు సంవత్సరాల క్రితం నాన్న పోయారు. అమ్మపోయిన తర్వాతగూడా ఆయన మారలేదు. పైగా యెక్కువయింది. నాన్నతో ఇన్ని బాధలుపడ్డ అమ్మ నన్ను వాటన్నిటికీ దూరంగా పెంచింది. చెప్పు! నిన్ననడంలో ఏమైనా తప్పుందా? కటువుగా చెప్పాను. నాకిష్టంలేని పనిని చేసిన వాళ్ళని అందరి లాగానే నిన్నూ అనుకున్నాను. నీకుప్రత్యేకత చూపించలేదు. దానికి నేను చాలా బాధపడ్తున్నాను. క్షమార్పణ గూడా కోరుకుంటున్నాను, సరేనా ?"

భుజంమీద తలాన్చుకున్న భార్యని తన వైపు తిప్పు కుంటూ అన్నాడు శేఖరం.

" నాకిదంతా తెలియదు. మీ కిష్టం లేని వాటినియెదుటివాళ్ళు తప్పని సరిగా అలవరుచుకోవా లని నిరంకుశంగా ఆలోచిస్తా రనుకున్నాను. మీకేవి ఇష్టమో, ఏవి అయిష్టమో నా కెప్పుడయినా చెప్పారా? ఈ దీన్ని గురించి గూడా ఇంత బాధపడిం తర్వాత చెప్పారు గానీ—"

"అసలిదంతా నీతో చెపాల్సి వస్తుందని అనుకోలేదు. ముందుగా ఏమని చెప్పమంటావు? నాన్న జూద రని, లేక అమ్మ బాధపడిందనా ? యివన్నీ చెప్తే నువ్వు నన్ను చులక నగా చూస్తావనుకున్నాను. నీ దృష్టి అందరిలాగే డబ్బు,

గౌరవం, నగలు వీటిమీద వుందనుకున్నాను. కానీ ఆర్నెల్లలో నిన్ను చాలా బాగా పరీక్ష చేసింతర్వాత గానీ నువ్వు వీటన్నిటికీ అతీతురాలివని తెలియలేదు. క్యాంప్‌కు వెళ్ళానన్నమాటేగాని క్షణం తోచలేదు. యెటు చూసినా నువ్వే జ్ఞాపకం వచ్చావు. పారిపోయి వచ్చేశాను." అరవిందని మరోసారి దగ్గరగా లాక్కుంటూ అన్నాడు శేఖర్.

"పోనీ యిదంతే యింతకథ వుందనుకుందాం. మరి ఆ రోజు క్లబ్‌కు వెళ్తే యెందుకు అలా గొడవ చేశారు ?" అమ్మయ్య కనీసం ఒక్కటయినా అడగ్గలిగాను అనుకుంది అరవింద మనసులో.

"క్లబ్ కా! యెప్పుడు ?" అర్థం గానట్లు చూశాడు.

"అదే! ఆ రోజున సుశీలతో వెళ్ళిన రోజున"

"ఓ! అదా—నేను విసుక్కుంది, కోప్పడింది క్లబ్‌కు వెళ్ళావనిగాదు, సుశీలతో కలిసి వెళ్ళావని. సుశీల విషయం నీకు తెలియదు. ఆ అమ్మాయితో నువ్వు కలిసి తిరగటం నాకిష్టం లేదు. ఒక్క సుశీలేగాదు దాదాపు వాళ్ళంతా అంతే! సంస్కారం పేరిట, నాగరికత పేరిట, వాళ్ళు చేసేపన్లు నాకు చాలా అసహ్యం! లోతుగా తెరిచిచూస్తే నువ్వూ అసహ్యించుకుంటావు" అరవింద చేతిగాజుల్ని సవరిస్తూ అన్నాడు శేఖర్.

"అన్నీ మీరు మనసులో అనుకుంటే నాకెలా తెలుస్తుంది? నేనేమో మిమ్మల్ని మరో దృష్టితో చూస్తున్నాను."

"ఏ దృష్టితో?" అరవింద కళ్ళలోకి ఆసక్తిగా చూస్తూ అడిగాడు శేఖర్.



కథా నిలయం
5113

"మీ కసలు ఆప్యాయత అంతకరణ, అంటే ఏమిటో తెలియదనుకున్నాను. ఆరోజు రాత్రినేను నిద్రేపోలేదు. పిలవకుండా వస్తే మీ అహంకారం మరింత పెరుగుతుందనుకున్నాను. కానీ మీరు పిలవలేదు. పిలిస్తే బాగుండేది. నేనింత బాధపడేదాన్ని గాదు. నా విరక్తి యెంతవరకు వచ్చేసిందో తెలుసా? యింక మీ మొహంగూడా చూడగూడదనిపించింది. ఈరోజు సుమిత్ర దగ్గరకువెళ్ళి వుద్యోగానికి అప్లికేషన్ గూడా యిచ్చి వచ్చాను. ఈరోజు యిలా అనుకోకుండా మీరు రాకుండా వున్నట్లయితే మరోవిధంగా జరిగివుండేది. నేను వూహించిందివేరు మీరు క్యాంప్ నుంచి తిరిగి వచ్చి నేను లేనని చెప్పకుండా వెళ్ళిపోయినందుకు ఆగ్రహం పొంగుతూ నాన్నపేర వుత్తరం రాస్తారనుకున్నాను. అప్పటికి నేను యిక్కడ ఉద్యోగంలో గూడా చేరిపోయి వుండేదాన్ని. ఇదంతా వివరంగా చెప్తూ మీకు వుత్తరం రాసేదాన్ని. కానీ మీరు అనుకోకుండా వచ్చేశారు. నేను సిద్ధంగా లేని పరిస్థితుల్లోకి లాక్కుపోయారు. యెంత అమూల్యక్షణాలివి!"

"అరవిందా!" శేఖర్ అస్పష్టంగా బాధగా అన్నాడు. "నువ్వు దీనికి యిపుడు బాధపడుతున్నావా?"

"లేదు, లేదు! సంతోషిస్తున్నాను. కరుణామయుడైన భగవంతుడికి చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నిజంగా మీరు యీ రోజురాకపోతే నేను ముందు ముందు చాలా బాధపడేదాన్నేమో! మీ కిష్టంలేని పనులు నేను చెయ్యను. ఒకవేళ చేస్తే—మీరిలా నన్ను దగ్గిరగా తీసుకుని అప్యాయంగా వద్దని వారించండి. అంతేగాని... అంతేగాని—నా అభిమానాన్ని

కెచ్చగొట్టవద్దు." శేఖర్ గుండెల్లో తలదాచుకుంటూ అంది అరవింద. తనని చిన్నపిల్లగా అల్లుకుపోయిన అరవింద జుట్టు నిమురుతూ ఆప్యాయంగా అలాగే వుండిపోయాడు శేఖర్.

... ... ...

తెల్లవారిపోయింది. అంతా చక్కబడి పోయింది. అరవిందని తనవెంట తీసుకు వెడతానన్నాడు శేఖరం. తండ్రి అనుమానంగా కూతురువైపు చూశాడు – అంతవరకూ తన వైపు చూస్తున్న అరవింద తలదించుకుని చిరునవ్వుతో అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయింది. తృప్తితో నిట్టూర్పు విడిచిన తండ్రి శేఖరంతో యిలా అన్నాడు.

"అరవింద కేమీ తెలియదు శేఖరం! అంతా చిన్నపిల్ల మనస్తత్వం. అంతలో అలుగుతుంది. మళ్ళీ అంతలోనే ప్రసన్నం అవుతుంది. మరి నీకెలావుందో ? ఏదయినా నువ్వు దూరం క్యాంప్ వెళ్ళాల్సివచ్చినప్పుడు యిక్కడకు పంపేస్తే మంచిది. ఒక్కతేవుండి, లేనిపోని ఆలోచనలన్నీ ఆలోచించుకుంటూ కూర్చుంటుంది." కళ్ళజోడు తీసి టేబిల్ మీద పెట్తూ అన్నారు ఆయన.

అంతవరకూ పేపరు చదువుతున్నట్టున్న శేఖరం పేపరు మడిచేసి "ఏం ఫర్వాలేదు, మీ కా బెంగేంవద్దు. నేను దూరం వెళ్ళాల్సివస్తే నాతో వెంటతీసుకు వెళ్తాను. అరవింద భార్యగా దొరకడం నా అదృష్టం అనుకుంటున్నాను."

మామగారివంక చిరునవ్వుతో చూస్తూ అన్నాడు శేఖర్. ఆ సాయంత్రం-కొత్త బట్టలలో, కాళ్ళకి పసుపుతో,

తలనిండా పూలతో, మెరుస్తున్న కళ్ళతో, చిరునవ్వులు ఒలకబోస్తూ నేను వెడ్తున్నానని చెప్పటానికి వచ్చిన అరవిందని చూసి సుమిత్ర తెల్లబోయింది. చేతుల్లో కాగితాలని అలాగే వదిలేసి నోరు తెరిచి అరవిందని చూస్తూ వుండిపోయింది.

"ఆశ్చర్యంగా అనిపిస్తోంది కదూ! అవును, నాకూ అలాగే అనిపిస్తోంది. రాత్రి ఆయన వచ్చారు. నేను చాలా అపార్థం చేసుకున్నాను సుమిత్రా! అంతా చక్కబడింది. పోన్లే, అన్నీ వున్న నాకెందుకు వుద్యోగం? వుద్యోగాలు లేక బాధ పడుతున్న మరొకళ్ళకిచ్చాను!" సుమిత్ర పక్కన కూర్చుంటూ అంది అరవింద.

'ఏం ఆడవాళ్ళు! యింకా నయం—చచ్చిచెడీ వుద్యోగం యిప్పించాను కాదు. వదిలేసి చక్కాబోను! నయమే పరువైనా నిల్చింది' అనుకుంది సుమిత్ర.

...—...